
# ఇచ్చుటలో ఉన్న హాయి...




డా.కొఠారి వాణీ చలపతిరావు

**"ఇచ్చుటలో ఉన్న హాయీ..మరి ఎచ్చటనూ లేనే లేదనీ..నిన్ననె నాకు తెలిసిందీ...!" అంటూ రేడియోలో పాట వస్తుంటే..వింటూ పని చేసుకుంటున్నాను. ఇంతలో 'పట్!' మని కరెంట్ పోయింది. నా మనసు ఆలోచనల్లో పడిపోయింది.**

ఇవ్వటంలో ఉన్న హాయి ఏమిటో సినిమాలో ఆ పాటకు అభినయించిన హీరోకు 'నిన్న'నే తెలిసిందేమో గానీ నాకు మాత్రం చిన్నప్పటి నుంచీ తెల్సు! ఇంటి ముందుకు బిచ్చగాడు ఎవరన్నా వచ్చాడంటే వెంటనే - "అవంతీ! అతనికి కొంచెం అన్నం పెట్టు" అని అమ్మ నాకే చెప్పేది. రోడ్డుమీద అమ్మ చెయ్యి పట్టుకుని నడుస్తూ వుంటే కాళ్లులేని, కళ్ళు లేని వికలాంగులు ఎవరైనా కనిపిస్తే అమ్మ చటుక్కున తన చేతిలోని చిన్నపర్సులోంచి ఓ రూపాయి బిళ్ల తీసి నాకు ఇచ్చి 'అతని చేతిలో వెయ్య'మనేది. దానికితోడు క్లాసులో మాకు పాఠం చెప్పే పంతులుగారు 'ఉపకారికి ఉపకారం చెయ్యటం గొప్ప పని అయితే...అపకారికి కూడా ఉపకారం చెయ్యడం అంతకన్నా గొప్పపని' అని చెప్పారు. అలా 'ఇచ్చే తత్వాన్ని' నర నరాల్లో జీర్ణింపచేసుకోవడంవల్ల ఇచ్చాక కలిగే ఆనందం, తృప్తి ప్రతిసారీ నాకు అనుభవానికి వస్తూనే ఉన్నాయి. ఇంట్లో కుటుంబ సభ్యులకు ప్రేమను పంచి ఇచ్చాను. అతిథి అభ్యాగతులకు ఆదరణను పంచి ఇచ్చాను. అవసరంలో అర్థులై వచ్చిన వాళ్లకు అడిగింది ఇచ్చాను. దేశంలో ఎక్కడ వరదలు, భూకంపాలులాంటి ప్రకృతి బీభత్సాలు వచ్చినా ఆర్థిక సాయం అందించాను. అందుకే కాబోలు అనుకోకుండా రేడియోలో వచ్చిన ఆ పాట నన్ను అంతగా ఆకర్షించింది.

"అవంతీ ఏం చేస్తున్నావ్. నాకు ఆఫీసుకు టైమ్ అవుతోంది" అని శ్రీవారు పిలవడంతో ఈ లోకంలోకి వచ్చి లేచి చకచకా ఆయన పనులు చేయడం మొదలు పెట్టాను.

స్నానానికి వేడినీళ్లు పెట్టాను.

టవలు..ఆ రోజు వేసుకోవాల్సిన ప్యాంటు, షర్టు తీసి రెడీగా పెట్టాను.

బ్రేక్‌ఫాస్ట్ డైనింగ్ టేబుల్ మీద సిద్ధంగా పెట్టి దగ్గరుండి మరీ వడ్డించాను. తిన్న తర్వాత ఆ ప్లేట్ తీసేసి... లంచ్‌బాక్స్ సిద్ధం చేసి చేతికి అందించాను. ఆయన బైక్ స్టార్ట్ చేసి బయటకు వెళ్లాక పరుగెత్తుకుంటూ వెళ్లి సెల్ ఫోను, కర్చీఫు అందించాను.

ఇలా- ప్రతిరోజూ ఆయన పనులన్నీ దగ్గరుండి చేస్తూ అన్నీ అందివ్వడంలో నాకు అదో రకమైన ఆనందం...తృప్తి!

అలా అనుకూలవతిగా ఉంటాననే ఆయనకూ నామీద మంచి అభిప్రాయం. ఇష్టం కూడా! ప్రతి పనికీ నా మీద ఆధారపడుతూ ఉండటంవల్ల స్వయంగా ఏదీ చేసుకోవాల్సిన అవసరమే ఉండదు ఆయనకు! ఆఫీసుకు పంపించాక ఇంటిపనంతా చేసుకుని నడుం వాల్చాను.

"అమ్మా" అంటూ వచ్చింది దీప్తి. దాని చేతిలో నా మెరూన్ కలర్ పట్టుచీర చమ్కీలు కుట్టింది ఉంది.

"అమ్మా! ఈ రోజు మా కాలేజీలో ఫంక్షను ఉంది. నీ చీర కట్టుకెళతాను..ఈ చీర అంటే నాకిష్టం!" అంది.

"కట్టుకో అమ్మా! నీకు అంతగా నచ్చితే ఆ చీర పూర్తిగా నువ్వే తీసేసుకో!" అన్నాను ప్రేమగా.

"మా అమ్మ మంచిది" అంటూ మురిసిపోయింది దీప్తి.

"తమ్ముడు ఎక్కడికెళ్లాడమ్మా..ఇంకా రాలేదు?" అని అడిగాను ధృవ నుద్దేశించి.

"పొద్దున వాడికి పాకెట్ మనీ ఇచ్చావుగా! ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాకెళ్లాడు" అంది దీప్తి.

దీప్తి, ధృవ నాకు రెండు కళ్లలాంటి వాళ్లు! వాళ్ళ సుఖం కోసం, సంతోషం కోసం నేను ఏదయినా చేస్తాను. ఏమడిగినా ఇస్తాను. అది నాకు ఆనందాన్ని ఇస్తుంది. దీప్తి చిన్నపిల్లగా ఉన్నప్పుడు దానికి రకరకాల డిజైన్లు పెట్టించి ఎన్నెన్ని ఫ్రాకులు, పరికిణీలూ కుట్టించేదాన్నో! ప్రతి బర్త్‌డేకీ ఏదో ఒక బంగారు నగ చేయించేదాన్ని! ఇప్పుడు దానికి లేని ఆభరణం లేదు.

ధృవకు బొమ్మలు, గన్లు, సైకిళ్లు అంటే ఇష్టం! బజారుకెళ్లినప్పుడు వాడు తన చూపుడు వేలు చూపించి ఏది అడిగినా 'వద్దు!' అనకుండా కొని ఇచ్చేదాన్ని. అది కొని ఇవ్వగానే వాడి కళ్ళల్లో కనిపించే ఆనందం నాకెంతో ఆనందాన్ని కలిగించేది. ఇక దీప్తి అయితే నేను బజారు నుంచి వస్తూ ఏదయినా తెచ్చి ఇవ్వగానే ఆనందం పట్టలేక నా మెడచుట్టూ చేతులేసి కౌగిలించుకుని నా బుగ్గ మీద ముద్దుపెట్టేది. పదే పదే 'థాంక్యూ' అంటూ మురిసిపోయేది. 'తల్లిదండ్రులు బ్రతికేది పిల్లలకోసమే..వాళ్ల ఆనందం తప్ప వీళ్లకు కావాల్సింది ఏముంది!' అనిపించేది నాకు ఆ క్షణంలో.

"అమ్మా!" అంటూ దీప్తి పిలవటంతో తలెత్తి చూసాను. దాని గొంతులోని ఆనందోద్వేగాలను గమనించి ఏదో విశేషముందని అనిపించింది.

"వైష్ణవి అత్తయ్య వచ్చింది!" అంది.

వైష్ణవి అంటే మా చిన్నాడపడుచు! మావారి ముగ్గురు అక్కచెల్లెళ్ళలో తనే ఆఖరుది! అనుకోకుండా వచ్చిన వైష్ణవి నాకు ప్లజంట్ సర్ప్రయిజ్‌ని ఇచ్చిందనే చెప్పాలి. ఆ మాటే తనతో అంటే నవ్వి "పుట్టిల్లు గుర్తుకొచ్చింది! అంతే బయలుదేరి వచ్చేసాను" అంది.

"మంచి పని చేసావు. నేనూ మీ అన్నయ్య రోజూ అనుకుంటూ వుంటాం. వైష్ణవిని చూసి చాలా రోజులయింది అని!" నేను అనగానే "అయితే రావచ్చుగా..ఎన్నడూ రారు!" అంది.

"ఆడ పిల్లలు మీరు పుట్టింటికి రావాలి గానీ మీ అత్తింటికి మేము అదేపనిగా రావటం బాగుండదు.." అని, "అవునూ! వైష్ణవీ! మీ అత్తగారు ఎలా ఉన్నారు?" అని అడిగాను ఎనభైయేళ్ల ముదివగ్గు అయిన ఆమె గుర్తుకు రాగానే.

"తన పనులు తను చేసుకుంటారు...అంతే! అంతకుమించి మంచం మీద నుంచి లేవలేరు!" అంది వైష్ణవి.


ఆడపడుచుకు మర్యాదపూర్వకంగా కాళ్లు కడుక్కోవటానికి చెంబుతో నీళ్లు అందిస్తూ...ఆలోచిస్తున్నాను నేను.

'కోడలు అయిన ఈమె చేయకపోతే అత్తగారు తన పనులు తాను చేసుకోక ఏం చేస్తుంది. ఎంత చాతగాకపోయినా! ఒకసారి వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు చూసాను. మంచం దగ్గరే చిన్న టేబుల్ వేసి అన్నం, కూర, పప్పు, పెరుగు గిన్నెలన్నీ చేతికి అందేలా దగ్గర పెట్టివస్తుంది. అంతేగానీ దగ్గర ఉండి వడ్డించదు. సాయంత్రం ఆరిన బట్టలు తీసుకొచ్చి, తనవి, తన భర్తవి, పిల్లలివి తను మడత పెట్టి అలమారాల్లో పెట్టు

కుని, ఆవిడవి మాత్రం ఆమె మంచంమీద పడేసి వస్తుంది. ఆమె లేచి మడత పెట్టుకుంటుంది. సాయంత్రం సన్నజాజి పూలు బుట్టలో కోసి..దారం ఉండ ఆ బుట్ట ఆమె ముందు పెట్టి 'మాల కట్టండి' అంటుంది. కట్టాక సగం పూలు మర్నాడు పూజకు ఉంచి సగం తను జడలో పెట్టుకుంటుంది. ఆ రోజు నేను ఉన్నాను గనుక అందులో మరో సగం తెంపి నాకు ఇచ్చింది.



అదంతా కామ్‌గా అబ్జర్వ్ చేసిన నాకు ఆ ముసలమ్మగారి మీద బోలెడు జాలేసింది. అలా అని వైష్ణవి చెడ్డదేమీ కాదు. పనంటే బద్ధకించే మనిషీ కాదు. 'అత్తగారు' అనే సరికి ఏ కోడలయినా అలాగే ఉంటుంది. అనుకోవటానికీ లేదు. మా అత్తగారికి నేను ఎంత సేవ చేయలేదు! కూర్చున్న దగ్గరికి అన్నీ అందించి ఏ పనీ ఆమె స్వయంగా చేసుకోవాల్సిన అవసరం లేకుండా అన్నీ నేనే అయి చేసాను..' అనుకున్నాను.. నన్ను గురించి నేను! అతిథిగా ఆడపడుచు రావటంతో ఆ రోజు స్పెషల్ వంటలు చేసి భోజనం పెట్టాను. "నాకన్నా పెద్ద దానివి. వదినవు..నువ్వు నాకు మర్యాదలు చేయటం ఏంటి? ఇన్ని రకాలు ఎందుకు చేసినట్టు..హెల్ప్ చేద్దామని వచ్చినా చెయ్యనివ్వలేదు. ఇలా అయితే ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు రావటానికి నాకు మొహమాటంగా ఉంటుంది! నన్నూ ఈ ఇంటి మనిషిగా ఎందుకు చూడవు వదినా" అంది.



వైష్ణవి ఎప్పుడొచ్చినా అలాగే మాట్లాడుతుంది.

"అది చేయలేదు. ఇది చేయలేదు" అని సాధించే ఆడపడుచులుంటారు ఏ ఇంట్లోనయినా. కానీ వైష్ణవి అలాకాదు. ఆ మాటకొస్తే మా వదిన దగ్గర నేనూ అలాగే ఉంటాను. పుట్టింటికెళ్లినా వదినను కూర్చోబెట్టి నేనే పనంతా చేస్తాను. నాలా మా వదిన 'వద్ద'ని ఏమీ అనదు. చక్కగా చేయించుకుంటుంది. నాకూ ఆనందంగానే ఉంటుంది అలా చేయడం! భోజనాలయ్యాక నేనూ వైష్ణవీ కబుర్లు చెప్పుకుంటున్నాం. ఉన్నట్టుండి వైష్ణవి తన బ్యాగు తెరచి "వదినా! నీకోసం ఈ చీర తెచ్చాను" అంటూ నా చేతిలో పెట్టి కాళ్లకు దండం పెట్టింది. అనుకోని ఆ మర్యాదకు కంగారుపడిపోయాను నేను. ఎవరికయినా నేను పెట్టడమే గానీ ఎవరినుంచీ ఏమీ తీసుకునే అలవాటు లేదు నాకు! నాకెందుకో అది నచ్చదు. అందుకే "వద్దు వద్దు! నువ్వు నాకు చీర పెట్టడం ఏంటి? ఆడపడుచువు, నీకు నేను పెట్టాలి గానీ..!" అన్నాను.

"నువ్వు ఎప్పుడూ... వచ్చినప్పుడల్లా నాకు చీర పెడుతూనే వుంటావు కదా..ఈసారి నన్ను పెట్టనీ..అమ్మలేని మాకు అమ్మలాంటిదానివి. అయి నా ఎప్పుడూ పుచ్చుకోవటమేనా పని? అప్పుడప్పుడయినా నన్నూ ఇవ్వనివ్వనీ...అందులోని ఆనందాన్నీ..తృప్తినీ నన్నూ అనుభవించనీ!" అంటూ పిల్లలకూ, వాళ్ల అన్నయ్యకూ కూడా కొత్త బట్టలు తీసి ఇచ్చింది.

వైష్ణవి అన్న ఆ ఆఖరి మాటలు..నా మనసుకు వేగంగా వచ్చి తగిలి..ఓ జర్క్ ఇచ్చాయి. నా ఆలోచనలను మరోవైపు మళ్లించాయి. చకచకా ఇంట్లో ఆ గదిలోనుంచి ఈ గదిలోకి తిరుగుతూ అన్ని పనులూ..అందరి పనులూ చేసి పెడుతున్న నన్ను చూసి "వదినా! పిల్లలకు నువ్వు మరీ స్పూన్ ఫీడింగ్ చేస్తున్నావేంటి? ఇండిపెండెంట్‌గా వాళ్ల పనులను వాళ్లను చేసుకోనివ్వరాదూ? అన్నయ్యేంటి భోజనం చేసిన ఎంగిలి కంచం కూడా వెళ్తూ వెళ్తూ కనీసం సింక్‌లోనయినా పడేయడు? ఇలా అయితే రేపు ఏదయినా అవసరం పడినప్పుడు కష్టం కదూ?" అంది.

ఆ మాటల్లో నన్ను మెచ్చుకుంటున్న ధ్వని కూడా ఉండటంతో ఆనందంతో నా పెదవుల మీద ఓ చిరునవ్వు వెలిసింది.

"వాళ్ల పనులను నువ్వు చాలా ఓపిగ్గా, కష్టపడుతూ, ఇష్టంతో చేస్తున్నావు బాగానే ఉంది. కానీ దానివల్ల వాళ్లకు ప్రతిదానికీ నీమీదో..ముందు ముందు మరొకరి మీదో ఆధారపడటం అలవాటయిపోతుంది. అది వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మాభిమానాన్ని దెబ్బతీయవచ్చు. ఇప్పుడు మా అత్తగారే

ఉంది. ఆవిడ పనులు అన్నీ నేను చేయగలిగినా చేయకుండా కొన్ని చిన్న చిన్న పనులు ఆమెకే ఎందుకు వదిలేస్తాననుకున్నావ్? ఓల్డేజ్‌లో 'నేను ఇతరుల మీద ఆధారపడి వున్నాను...నేను నిస్సహాయను. నా పనులు కూడా నేను చేసుకోలేను' అన్న ఆలోచన మానసికంగా వాళ్లను కృంగదీస్తుంది. పనేమి లేక ఖాళీగా కూర్చోవటం వల్ల మరణభీతి, అనవసర అనారోగ్యపు ఆలోచనలు మనసులో ప్రవేశించి మనిషిని మానసికంగా దెబ్బ తీస్తాయి. అందుకే ఆవిడకు 'కోడలి మీద ఆధారపడి ఉన్నాను' అన్న ఆలోచన రాకుండా జాగ్రత్తపడుతూ వుంటాను. అంతేకాదు 'నేనే ఆవిడ మీద ఆధారపడి ఉన్నాను' అన్న భావం ఆమెలో కలిగేలా కూడా నేను ప్రవర్తిస్తూ ఉంటాను!" అంటూ చెప్పుతూ పోతోంది వైష్ణవి.

తన ఒక్కొక్క మాటా నన్ను ఆశ్చర్యంలో ముంచేస్తూ నాకు తెలియని ఏవేవో కొత్త లోకాలకు నన్ను తీసుకెళ్లాయి.

ఆ ఆలోచనా విధానం నన్ను దిగ్భ్రమకు గురిచేసింది.

'ఇవ్వడం అంటే డబ్బులివ్వడం, నగలూ, కొత్తబట్టలివ్వడం, దానమివ్వడం, శ్రమను ఇవ్వడం ఇవే అనుకుంటున్న నాకు ఎదుటివాళ్లకు ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మాభిమానాన్ని, మనశ్శాంతిని, తృప్తిని కూడా ఇవ్వవచ్చని అప్పుడే కొత్తగా ఓ జీవితపాఠం నేర్చుకున్నట్టు అనిపించింది. పైన చెప్పినవి నేనే కాదు ఈ లోకంలో ఇంకా చాలామంది ఇస్తుండవచ్చు. కానీ వైష్ణవి చెప్పినవాటిని వైష్ణవిలాంటి దూరాలోచన, లోతైన విశ్లేషణగలవాళ్లు ఏ కొద్దిమందో మాత్రమే ఇవ్వగలరు!' అనిపించింది. దాంతో అన్నాళ్ల నా ఆలోచనా విధానం ఒక్కసారిగా తల్లకిందులయినట్లు అనిపించింది.

రెండు రోజులుండి వైష్ణవి వెళ్లిపోయింది. ఆమె వెళ్లినా ఆమె మాటలు మాత్రం నన్ను వెంటాడటం మానలేదు.



* * *

'అంతా మనం అనుకున్నట్టు జరగదు. అన్ని రోజులూ మనవి కావు. ప్రతిరోజూ సాదాసీదాగానే గడిచిపోదు' అన్న జీవిత సత్యం ఆరోజు బాత్‌రూమ్ కడుగుతూ అమాంతం కాలుజారి నేను కింద పడిపోయినప్పుడు అనుభవ పూర్వకంగా అర్థమయింది. ఒక్క కేకపెట్టడంతో మావారు, పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చారు. తుంటిపట్టుకుని బాధతో విల విల లాడిపోతున్న నన్ను హడావుడిగా ముగ్గురూ కలిసి అమాంతం పైకి లేపి మంచం మీదికి చేర్చారు. ఆ తరువాత ఆర్థోపెడిక్ హాస్పటల్‌కి తీసికెళ్తే డాక్టరు అన్ని పరీక్షలూ చేసి తుంటి ఎముక ఫ్రాక్చర్ అయిందని చెప్పి కట్టువేసి ఆరు వారాలు మంచం మీదే ఉండాలని అన్నారు. దాంతో నా పై ప్రాణాలు పైనే పోయినట్లు అనిపించింది. పొద్దున లేచిన దగ్గరి నుంచీ రాత్రి పడుకోబోయే వరకూ ఇంట్లో ఎన్నో పనులు ఉంటాయి. అందరి అవసరాలనూ సమయానికి తీర్చాల్సి వుంటుంది.

'అవన్నీ ఇప్పుడెలా..? ఎవరు చేస్తారు ఇంటెడు పని?' అనుకున్నాను.

కానీ ఆశ్చర్యం!

ఫ్రిజ్‌లో నుంచి మంచినీళ్లయినా తీసుకుని తాగటం చేతకాని మావారు చకచకా కాకపోయినా..మెల్లిమెల్లిగా ఒకదాని తర్వాత ఒకటిగా ఇంటిపనులు చక్కబెడుతున్నారు.

మా అబ్బాయి ధృవ బయటికెళ్లి కిరాణాసామాన్లు..కూరగాయలు తెస్తున్నాడు. తన పనులు తను చేసుకుంటున్నాడు.

మా అమ్మాయి దీప్తి వంటగదిలో 'అవస్థపడుతూనే' అయినా వంట చేసి...అందరికీ వడ్డిస్తోంది. నాకు మంచం దగ్గరికే అన్నం, నీళ్లు అందిస్తూంది. నాకు బెడ్ ప్యాన్ పట్టడం, స్పాంజ్ చేయటం, చీరకట్టడం అదనపు పని అయింది దానికి.

ఎప్పుడూ అందరికీ చేయటమే తప్ప ఎవ్వరితో చేయించుకోవటం అలవాటులేని నాకు నా నిస్సహాయత మీద నాకే కోపం వస్తోంది. దాంతో నాకు

## వెరైటీ కత్రినా

***హీరోయిన్లు కూడా ఐటమ్ సాంగ్స్ చేయడం అన్ని భాషాచిత్రాల్లోనూ చూస్తూనే వున్నాం. కత్రినా కూడా ఐటమ్ నంబర్లు చేసింది. అయితే కొత్తగా 'తీస్ మార్ ఖాన్' అనే సినిమాలో'ఐటమ్ గాళ్'గా పాత్ర పోషించబోతోంది కత్రినా. కొరియోగ్రాఫర్-డైరెక్టర్ ఫర్హాఖాన్ దర్శకత్వం వహించే ఈ సినిమాలో హీరోగా అక్షయ్ కుమార్ నటిస్తున్నాడు. ఐటమ్ గాళ్‌గా ఆ పాత్రలో ఏం ప్రత్యేకత వుంటుందో కదా అని అప్పుడే బాలీవుడ్ జనాలు ఆసక్తి కనబరుస్తున్నారు. వెయిట్ అండ్ సీ అంటోంది కత్రినా.***

విసుగూ, చిరాకూ ఎక్కువయ్యాయి.

మా పెద్దాడపడుచు..నడిపాడపడుచు ఉదయం వచ్చి సాయంత్రం రైలుకు తిరిగి వెళ్లిపోయారు. మా అమ్మా, నాన్నా వృద్ధాప్యం వల్ల కదలలేని స్థితిలో ఉన్నారు. ఇద్దరు అక్కలు ఎక్కడో దూరంగా విదేశంలో ఉంటారు. అన్నయ్య ఢిల్లీ నుంచి వచ్చి చూసి వెళ్లాడు. మా చిన్నాడపడుచు వైష్ణవి మాత్రం విషయం తెలియగానే బట్టలు సర్దుకుని బయలుదేరింది. నా నిస్సహాయస్థితిని..నా మానసిక వ్యధను చూసి "ఎప్పుడు ఏం జరుగుతుందో..ఎవరం ఎలాంటి స్థితిలో ఉంటామో తెలవదు..అదే మరి జీవితం అంటే! ఆరు వారాలు కాస్త ఓపికపట్టి, ప్రాక్టికల్‌గా ఆలోచించావంటే..మళ్లీ లేచి ఇల్లంతా తిరుగుతూ పనులు చేసుకుంటావ్ వదినా!" అంది నాకు ధైర్యం చెబుతూ.

ఆ మాటలు దెబ్బతిన్న నా మనసుమీద మలాములా పనిచేస్తున్నట్లు అనిపించింది. వైష్ణవి వచ్చాక ఇంటిపనులు, వంటపని ఓ ఊపులో సాగిపోవటం మొదలుపెట్టాయి. యాక్టివ్‌గా తను పనులు చేస్తున్నప్పుడు దీప్తిని కూడా సహాయానికి పక్కన ఉంచుకుని ఏ పని ఎలా చేయాలో చెప్పటం గమనించాను నేను.

వైష్ణవి మాట తీరు...చొరవ..కలివిడితనం నాకు మొదటినుంచీ తెలిసినవే అయినా..ఆ సమయంలో ఎందుకో ముచ్చటేసింది నాకు. తను దేనికీ సంకోచించదు. తడుముకోదు. పైకి ఒక మాట లోపల మరొక ఆలోచన అన్నట్టు ఉండదు. తను నమ్మిన విషయాన్ని..నచ్చిన సిద్ధాంతాన్ని నిస్సంకోచంగా, ఖరాఖండిగా, చెప్తూ..పాటించే మనిషి.

నిన్న సాయంత్రం ఇంటిముందు ఓ బిచ్చగాడు నిల్చుని వుంటే నేను చెప్పిన మీదట ధృవ ఓ రెండు రూపాయలు తీసుకెళ్లి అతని చేతిలో పెట్టబోయాడు.

"ఉండు ధృవా! ఇవ్వకు" అంది వైష్ణవి.

నేనూ, వాడూ ఆశ్చర్యపోయి చూస్తుండగా-

"అతనొక తాగుబోతు..చూస్తుంటే కనిపించటం లేదూ? నువ్వు ఇచ్చే డబ్బులు అతను తాగుడుకు ఖర్చుపెడతాడు. తిండికి కాదు. వ్యసనపరులకు చేసే దానం ప్రతిఫలాన్ని ఇవ్వదు..!" అంటూ -

"ఒక్క వీళ్లే అని కాదు... బాధితుల సహాయ సేకరణ పేరిట ప్రజల సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకునేవి..మోసం చేసి తమ పబ్బం గడుపుకునేవి బోగస్ సంస్థలు చాలా ఉంటాయి. గుర్తింపుపొందిన వాటికి తప్ప ఎవరికిబడితే వాళ్లకు ఇస్తే సమాజపు చెడులో మనమూ భాగస్వాములయినట్లు అవుతుంది" అంది వైష్ణవి.

తను అలా మాట్లాడుతుంటే వింటూ ఉండిపోయాను నేను. ఆ సమయంలో నా మనసు తప్ప నోరు మాట్లాడలేకపోయింది.

* * *

మాటిమాటికీ దీప్తితో బెడ్‌పాన్ పెట్టించుకోవాల్సి రావటం నాకు చాలా ఇబ్బందిగా ఉంది. అదే మాట తనతో అంటే "ఎందుకమ్మా అలా మాట్లాడతావ్..మా కోసం నువ్వు ఎంత చెయ్యటం లేదు! అవసరం పడినప్పుడు మేమూ నీకు సేవ చేయడం అదో పెద్ద విషయం అన్నట్టు అంతగా ఫీల్ కావాలా? నీకిలా అయినందుకు నిజానికి బాధగా ఉన్నా నీకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు తృప్తిగా ఉంది" అంది దీప్తి.

'ఇవ్వటంలో ఉన్న హాయి'ని తనూ ఆనందిస్తున్నట్టు నాకు దాని మాటల వల్ల అర్థమయింది. అవి నా స్వంతమే అన్నట్టు అన్నాళ్లూ అనుకున్న నా అజ్ఞానానికి, అవగాహనా రాహిత్యానికి నేను సిగ్గుపడిపోయాను. ఆ ఆలోచనలోనే..అలాగే నిద్రపోయాను కొంతసేపు! తర్వాత లేచి..."దీప్తి" అని పిలిస్తే అది పలకలేదు..దాని బదులు "ఏంటి వదినా? ఏం కావాలి?" అంటూ వైష్ణవి వచ్చింది.


"ఏం లేదులే..దీప్తి ఏం చేస్తోంది?" అన్నాను.

"తను స్నానం చేస్తోంది. బెడ్ పాన్ పెట్టాలా?" అడక్కుండానే మార్దవంగా అడిగింది.

"అహ! వద్దు! అవసరం లేదు" అన్నాను సిగ్గుతో.

"మనిషికి..మనిషి సాయం అంటారు...నీ బిడ్డలాంటిదాన్ని నా దగ్గర నీకు మొహమాటమేంటి వదినా! ఇదే పరిస్థితి నాకు వస్తే నువ్వు చెయ్యవా?" అంది బెడ్‌పాన్ తెచ్చిపెడుతూ.

ఆ సేవ నాకు ఆశ్చర్యాన్నే కాదు... నాలోని అహాన్నీ తొలిగించింది.



## పులుల కోసం...

*బాలీవుడ్ భామ లారాదత్తాకి చెప్పుకోదగిన సినిమాలు చేతిలో లేవు. కానీ ఏదో ఓలా బిజీగా వుండాలని కాబోలు కొత్తగా ఓ కాంపెయినింగ్‌కి శ్రీకారం చుడుతోందిట. అదేంటంటే- 'సేవ్ టైగర్స్' కార్యక్రమం. 'దేశంలో రోజురోజుకీ పులుల సంఖ్య తగ్గిపోతోంది. ఈ జీవుల్ని గురించి సీరియస్‌గా పట్టించుకునే వాళ్లు కరువైపోతున్నారు. అందుకనే జనాల్లో ఓ అవేర్‌నెస్ తీసుకొచ్చి, ప్రభుత్వం వారు కూడా తగిన చర్యలు తీసుకోవాలీ అంటే కాస్త ప్రచారం చేయాలి, అందుకు నేను రెడీ అవుతున్నాను' అంటోంది లారా. శుభం!*